4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 13 జూలై 2024
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# ఎవరి కోసం ఈ పునరుజ్జీవం ?



అస్కాని మారుతీ సాగర్
90107 56666

ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఈ మధ్యకాలంలో కనిపించిన అరుదైన దృశ్యం ఇద్దరు సీఎంల మధ్య భేటీ. అది కూడా ఒకరు ఇండియా కూటమికి చెందినవారైతే, మరొకరు ఎన్డీయే కూటమికి చెందినవారు కావడం గమనార్హం. ఆ సంగతి అలా ఉంచితే ఆ భేటీ అనంతరం జరిగిన ఓ పరిణామం అందరి దృష్టిని ఆకర్షించింది. అదేమిటంటే.. తెలంగాణలో టీడీపీ పునరుజ్జీవం గురించి చంద్రబాబు మాట్లాడటం.

వాస్తవానికి తెలంగాణలో టీడీపీ పునరుజ్జీవం పొందితే ఎవరికి ప్రయోజనం? తెలంగాణ ప్రజలకు, తెలంగాణకు ఏమైనా మేలు జరుగుతుందా? తెలంగాణ ఉద్యమ సమయంలో రెండు కండ్ల సిద్ధాంతంతో పైకి కనిపించిన బాబు.. వాస్తవానికి ఒక కంటితోనే చూశారు. ఉద్యమ సమయంలోనే కాదు, తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా తన చూపు ఒకవైపేనని ఆయన స్పష్టం చేశారు. పదేండ్ల పాటు ఏపీలోనే రాజకీయం చేశారు. తెలంగాణలో టీడీపీ ఖాళీ అయినా ఆయన పట్టించుకోలేదు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లోనూ టీడీపీ పోటీ చేయదని చెప్పి.. పార్టీని నమ్ముకున్న వారి ఆశలపై నీళ్లు చల్లారు. పోటీ చేసే అభ్యర్థుల జాబితా సిద్ధమైపోయాక, బీ ఫామ్‌లు ఇవ్వడమే తరువాయి అనే సమయంలో.. పోటీకి ససేమిరా అన్నారు బాబు. ఎవరి ప్రయోజనాల కోసం బరిలో నుంచి టీడీపీని ఎందుకు తప్పించారో తెలంగాణ ప్రజలకు తెలియనిది కాదు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎట్టి పరిస్థితుల్లోనూ చీలడానికి వీల్లేదని భావించి, కాంగ్రెస్‌తో కుమ్మక్కై టీటీడీపీతో సెల్ఫ్ సూసైడ్ చేయించారు. అలాంటి బాబు నేడు ఆరు నెలలు తిరగకముందే పునరుజ్జీవం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉన్నది.

ఏపీలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బాబు రాజకీయంగా చాకచక్యంగా పావులు కదుపుతున్నారు. ఏపీలో బీజేపీతో అధికారాన్ని పంచుకుంటూ.. తెలంగాణలో కాంగ్రెస్‌తో మైత్రీ నెరుపుతున్నారు. అటు ఏపీలోనూ కాంగ్రెస్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే ఉభయ రాష్ట్రాల్లో అక్కడ వైసీపీకి, ఇక్కడ బీఆర్‌ఎస్‌కు ఏక



కాలంలో చెక్ పెట్టేందుకు వ్యూహాలు రచిస్తున్నట్టు తెలుస్తున్నది. ఏపీలో కూటమి నేతలు, కాంగ్రెస్ నాయకుల మధ్య పెద్దగా విమర్శలు, ప్రతి విమర్శలు లేవు. అక్కడ అన్ని పార్టీల టార్గెట్ వైసీపీయే. తెలంగాణలో బీఆర్‌ఎస్ నుంచి ఇప్పటికే కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతుండగా.. టీడీపీలోకి కూడా వలసలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే పార్టీ పునరుజ్జీవం గురించి వ్యాఖ్యానించి ఉంటారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఉభయ రాష్ట్రాల్లోనూ గత ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలను మార్పుచేర్పులతో కొనసాగిస్తూనే, అదనంగా కొన్ని సంక్షేమ పథకాలు చేరుస్తామని రెండు రాష్ట్రాల్లోని అధికార పార్టీలు చెప్పాయి. కానీ, పరిస్థితులు చూస్తుంటే.. సంక్షేమ పథకాల్లో మార్పు కంటే రాజకీయ మార్పుచేర్పులపైనే ఎక్కువగా చర్చ జరుగుతున్నది.

**టీడీపీ పునరుజ్జీవం గురించి మాట్లాడుతూనే బాబు మరో మాట కూడా చెప్పారు. తెలంగాణ గడ్డపైనే టీడీపీ పుట్టిందని, ఇక్కడ పుట్టిన పార్టీని మరోసారి ఇక్కడ బలంగా విస్తరిస్తానని శపథం చేశారు. ఒకరిద్దరు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు చంద్రబాబును కలిశారు. ఈ పరిణామాలను చూస్తుంటే.. ఈసారి బాబు పక్కాప్లాన్‌తో తెలంగాణలో రీ ఎంట్రీ ఇవ్వబోతున్నారని తెలుస్తున్నది. ఈ తరుణంలో తెలంగాణలో పుట్టిన టీడీపీ ఇక్కడి రైతుల నడ్డి విరిచే విధానాలను ఎందుకు అమలు చేసింది? బోరు మోటర్లపై ఆధారపడి సాగు చేసే రైతులపై అదనపు కరెంట్ భారం ఎందుకు మోపింది? అనే ప్రశ్నలకు చంద్రబాబు సమాధానాలు చెప్పాలి.**

అంతేకాదు, 1982 నాటికే ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం కొన్ని సమూహాలు పనిచేస్తున్నాయి. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత తెలంగాణవాదం లేదని నిరూపించేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. అందుకే 1990 నాటి అసెంబ్లీ ఎన్నికల్లో కోస్తాంధ్ర ప్రాంతానికి చెందిన నాయకులకు రూరల్ తెలంగాణలోని నియోజకవర్గాల్లో టికెట్లు ఇచ్చారు. హైదరాబాద్‌లోని ఒక నియోజకవర్గంలో సీమాంధ్ర నాయకుడిని బరిలో దించారు. తెలంగాణ ప్రజలు అతన్ని ఓడించి, తెలంగాణవాదానికి జై కొట్టారు. అయితే తెలంగాణ ప్రాంతానికి చెందినవారితో కోస్తాలో పోటీ చేయించేందుకు సాహసం చేయలేదు నాటి టీడీపీ. తెలంగాణ ప్రాంతాన్ని తమ వలస ప్రాంతంగా చేసుకునేందుకు నాడు టీడీపీ ప్రయత్నించింది. దాన్ని ముందుగానే పసిగట్టిన తెలంగాణవాదులు వారి వ్యూహాలను తిప్పికొట్టారు.

అప్పుడెప్పుడో జరిగిన దాని గురించి ఎందుకు. మొన్నటి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో చంద్రబాబు పోషించిన పాత్ర గురించి తెలంగాణ ప్రజలు ఇంకా మర్చిపోలేదు. సీమాంధ్ర నాయకుల రాజీనామా డ్రామాల వెనుక ఉన్నది బాబేనని నాటి ఉద్యమ సమాజానికి తెలుసు. డిసెంబర్ 9 ప్రకటన తర్వాత మరో ప్రకటన రావడం.. ఆ తర్వాత తెలంగాణలో వందలాది మంది బలి దానాలు చేసుకున్న వేదనాభరిత ఘటనలకు ఆయనే కారణం. ఎన్నో కష్టనష్టాలకోర్చి, ప్రాణ త్యాగాలు చేసుకుని తెలంగాణ ప్రజలు స్వయం పాలన సాధించుకున్నారు. పదేండ్ల స్వయం పాలనా ఫలితాలను తెలంగాణ సమాజం అనుభవం ద్వారా చూసింది. ఉమ్మడి రాష్ట్రానికి, స్వయం పాలనకు మౌలికమైన తేడా కూడా కనిపించింది. సీమాంధ్ర రాజకీయ కుట్రల ద్వారా ఇవన్నీ తమకు దూరమవుతాయననే ఆందోళన ఇప్పుడు తెలంగాణ సమాజంలో వ్యక్తమవుతున్నది.

సంక్షేమ రాష్ట్రంగా ఉన్న తెలంగాణ ఇప్పుడు ఎటువైపు పయనిస్తున్నదో అర్థం కావడం లేదు. ఈ సందర్భంలోనే తెలంగాణలో టీడీపీని పునరుజ్జీవింపజేస్తామని చంద్రబాబు చెప్పడమంటే ముమ్మాటికీ తెలంగాణ ప్రజాప్రయోజనాలను, భవిష్యత్తును గందరగోళంలో పడేసినట్టే. పదేండ్లుగా 'జై ఆంధ్ర' నినాదమే వల్లించిన ఆ నోట కొత్తగా 'జై తెలంగాణ' అనే నినాదం రావడం ఆంధ్ర వాళ్లను ఆలోచింపజేయవచ్చేమో కానీ, తెలంగాణవాళ్లను మాత్రం పక్కా ఆందోళనకు గురిచేస్తున్నది.

**పదేండ్ల తర్వాత మళ్లీ ఆంధ్రావాళ్ల పెత్తనం ఏమిటనే ప్రశ్న యావత్ తెలంగాణ సమాజాన్ని ఆలోచింపజేస్తున్నది. కాబట్టి స్వయంపాలన కోసం తండ్లాడి సాధించుకున్న తెలంగాణలో మొదలవుతున్న కుట్రలకు ఆదిలోనే అడ్డుకట్ట వేయాలె. ఈ కుయుక్తుల నేపథ్యంలో తెలంగాణ ప్రజలు మరో ఉద్యమానికి సమాయత్తం కావాలె.**

# పోరుగడ్డ ఓయూలో క్షీరాభిషేకాలా?



ప్రశాంత్ పగిళ్ల
95812 62429

**ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతిష్ఠ మసకబారుతున్నది. ప్రశ్నించేతత్వాన్ని క్రమంగా ఓయూ కోల్పోతున్నది. తెలంగాణ ఏర్పాటుకు మునుపు, తర్వాత చరిత్రను పరిశీలిస్తే ఈ విషయం సులువుగానే అర్థమవుతుంది. ఓయూ అంటే నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షల వ్యక్తీకరణే కాదు, ప్రపంచ దేశాల్లోని ప్రజాస్వామిక ఉద్యమాలకు గొంతు కలిపి, నినదించిన చరిత్ర కూడా.**



పొరుగునే ఉన్న ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో జరుగుతున్న మానవ హననం, మణిపూర్ అమానవీయ గాయాలు, ఎక్కడో గాజా, మరెక్కడో ఉక్రెయిన్.. ఇలా ఎక్కడ అన్యాయం జరిగినా న్యాయం కోసం గొంతెత్తిన పోరు పాఠశాల ఓయూ. దూరంగా నిలబడి బాధితులకు సంఘీభావం తెలపడం కూడా నిషిద్ధమైన చోట, ఓయూ గద్గద స్వరం వినిపిస్తూనే ఉంటుందని అనేకానేకసార్లు చాటింది. ఇదే కోట్లాది జనులకు ఓయూపై ఓ ఆశ, ప్రేమ, భరోసా కలిగేందుకు కారణమైంది. ఈ నేల మీద తీవ్రమైన సంఘర్షణ కొనసాగినప్పుడు సగటు తెలంగాణ బుద్ధిజీవి పాలకపక్షాన్ని కాదని, ఓయూ వైపు ఆశగా చూడటం ఎప్పుడో ప్రారంభించాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో 'ఉద్యమానికి మేం నాయకత్వం వహిస్తామనే గంభీరమైన ప్రకటన ఎంతోమందికి ఓయూపై అమితమైన విశ్వాసాన్ని కలిగించింది. అందుకే ఉద్యమ సమయంలో ఓయూతో తెలంగాణ కలిసి నడిచింది. 'రాజకీయాలకు తలొగ్గని తెగువ, ప్రజా ఆకాంక్షల దివిటీ' ఓయూ అనే విశ్వాసంతోనే ఓయూను తెలంగాణ గుండెల నిండా ప్రేమించింది, ప్రేమిస్తున్నది కూడా. కానీ, ఇప్పుడు ఓయూ ఆ బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమవుతూ, తన సహజత్వాన్ని కోల్పోతున్నది.

ఓయూ ప్రశ్నించడం మానుకుంటున్నది. ఒకానొక దశలో పిలుపుతోనే ప్రభుత్వాలను గడగడలాడించిన ఓయూ విద్యార్థి సంఘాలు.. ఇప్పుడు ప్రభుత్వ భజన బృందాలుగా మారడం ఈ దశాబ్ద కాలపు విషాదం. గతంలో ఎంతోకొంత అలజడి కనిపించింది. ప్రభుత్వాన్ని ఓయూ నిలదీసింది. తాను తలుచుకుంటే ప్రభుత్వాన్ని సైతం మార్చేసే వీరత్వం కలిగిన ఓయూ.. ఇప్పుడు అప్రకటిత నిర్బంధం విధిస్తున్న రేవంత్ రెడ్డిని కీర్తించడం, పాలకపక్ష దుర్మార్గ విధానాలపై నోరెత్తకపోవడం ఓయూపై ప్రజలకున్న నమ్మకాన్ని వమ్ముచేయడమే. ఆవేదన, అన్యాయం, అక్రమాలపై పోరాటాలకే వేదికగా నిలిచే ఆర్ట్స్ కాలేజీ.. తన ప్రాంగణంలో పాలకులకు జరుగుతున్న పాలాభిషేకాలను తన గుండెల మీద పెనుమంటల గాయాలుగా భావిస్తున్నది. ప్రధాన ప్రతిపక్షమై నిలిచిన ఓయూ చరిత్రకు మెజారిటీ విద్యార్థి సంఘాలు చితులను పేర్చుతున్నాయి. అన్యాయాన్ని ఎండగట్టడం తప్పితే సమర్థించిన చరిత్ర లేని ఓయూకు తలవంపులు తీసుకువస్తుండటం భావదారిద్ర్యమే.

హక్కుల కోసం పోరాడితే అరెస్టులు, నినదిస్తే వెంటనే చుట్టుముట్టడం, నిరుద్యోగుల కోసం ప్రజాస్వామ్యయుతంగా దీక్షలు చేస్తే క్షణాల్లో అరెస్ట్ చేయడం, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తే ముందస్తు అరెస్టులు చేయడం, నిర్బంధించడం. ఓయూలో ఇవన్నీ మన కండ్లముందే జరుగుతుండగా.. కాంగ్రెస్ హయాంలో మార్పు వచ్చిందంటే ఎలా నమ్మాలి. అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. ఈ హామీలకు 'మాది పూచీ' అని ప్రియాంకాగాంధీ ప్రకటించారు. కానీ, తామెక్కడా ఈ హామీ ఇవ్వలేదని నిస్సిగ్గుగా డిప్యూటీ సీఎం భట్టి వ్యాఖ్యానిస్తే.. ఓయూలోని ఒకటి, రెండు మినహా అన్ని విద్యార్థి సంఘాలు పెదవి విప్పకపోవడం దేనికి సంకేతం? ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకున్నా విద్యార్థి సంఘాలు నోటికి తాళం వేసుకోవడం దుర్మార్గం కాదా? 1200 మంది అధ్యాపకులు ఉండాల్సిన ఓయూలో కేవలం 300 మంది మాత్రమే ఉన్నారు. తద్వారా విద్యా వ్యవస్థ గాడితప్పుతుంటే మౌనం వహిస్తూ, ప్రభుత్వాన్ని కీర్తించడం వర్సిటీలోని విద్యార్థి సంఘాల దిగజారుడుతనానికి పరాకాష్ఠ కాదా? పూర్తి ప్రజాస్వామిక హక్కులతో ఉండాల్సిన వర్సిటీ ప్రాంగణంలో పోలీసులు అక్రమంగా చొరబడి, విద్యార్థులను ఎత్తుకుపోతుంటే విద్యార్థి సంఘాలు ఐక్యం కాకపోవడం ఓయూ స్వభావానికి తిరోగమనం కాదా? అనేక సమస్యలతో ఓయూ సతమతం అవుతుంటే, వాటిని వదిలేసి.. ప్రభుత్వానికి ఫక్తు బానిసలా మారడమంటే ఓయూ విద్యార్థి సంఘాల ఔన్నత్యానికి పెద్ద మచ్చే.

తెలంగాణను రక్తసిక్తం చేసిన దుర్మార్గుడు, ఒకనాటి ఓయూ ఉద్యమకారులను పొట్టనపెట్టుకున్న చంద్రబాబు ఈ నేలపై అడుగుపెడితే పాలాభిషేకాలు చేయడం ఓయూ పోరాట వారసత్వాన్ని దెబ్బతీయడమే. తన వందేండ్ల చరిత్రలో ప్రతిసారి ప్రతిఘటన పోరాటాన్ని ప్రదర్శించిన ఓయూ సహజ స్వభావాన్ని గడిచిన కొన్నేండ్లుగా ప్రదర్శించకపోవడం లక్షలాది గుండెలకు గాయం చేస్తున్నది. రాడికల్ ఉద్యమాలకు కాదు, రైతాంగ ఉద్యమాలకు మద్దతుగా నిలిచిన ఓయూ.. ప్రభుత్వాల ఎజెండాలో భాగస్వామ్యం కావడం తెలంగాణవాదులను కలవరపరుస్తున్నది.

ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఏడో గ్యారంటీ అని ప్రకటించిన కాంగ్రెస్.. అప్రజాస్వామిక విధానాలకు పాల్పడుతున్నది. ప్రధాన ప్రతిపక్ష పార్టీని దొడ్డిదారిన కాంగ్రెస్ కుళ్లబొడుస్తుండటంతో ఓయూ అయినా ప్రధాన ప్రతిపక్షంగా నిలుస్తుందని ప్రజానీకం గంపెడు ఆశలు పెట్టుకున్నది. కానీ, వారి ఆశలపై నీళ్లు చల్లుతూ ప్రభుత్వాధినేత కీర్తనలో తనివితీరడం ఎంతో బాధాకరం. ఓయూ విద్యార్థి సంఘాలు ఇకనైనా ప్రభుత్వానికి జోలపాట పాడటం మానుకోవాలి. ఘనమైన చరిత్ర కలిగిన ఓయూ ఇకనైనా ఉద్యమాలను నిర్మించడంలో భాగమవుతుందని ఆకాంక్షిద్దాం.

**ఆవేదన, అన్యాయం, అక్రమాలపై పోరాటాలకే వేదికగా నిలిచే ఆర్ట్స్ కాలేజీ.. తన ప్రాంగణంలో పాలకులకు జరుగుతున్న పాలాభిషేకాలను తన గుండెల మీద పెనుమంటల గాయాలుగా భావిస్తున్నది. ప్రధాన ప్రతిపక్షమై నిలిచిన ఓయూ చరిత్రకు మెజారిటీ విద్యార్థి సంఘాలు చితులను పేర్చుతున్నాయి. అన్యాయాన్ని ఎండగట్టడం తప్పితే సమర్థించిన చరిత్ర లేని ఓయూకు తలవంపులు తీసుకువస్తుండటం భావదారిద్ర్యమే.**



# ఆహా.. అని తింటే.. దవాఖానకే!

**'తిండి కలిగితే కండ కలదోయ్' అన్న మహాకవి మాట తినడానికి నోచుకోని నాటి కాలానికి సంబంధించినది. ఆహార ఉత్పత్తులలో స్వయం సమృద్ధి సాధించిన నేపథ్యంలో 'నాణ్యమైన తిండి కలిగితేనే కండ కలదోయ్!' అనే మాట నేడు సార్థకమవుతుంది. ప్రామాణికమైన ఆహార పదార్థాలతోనే ఆరోగ్యం సంతరించుకుంటుంది.**



పార్థసారథి తీగుళ్ల

నేను ఒకసారి అమెరికా వెళ్లేటప్పుడు లండన్‌లోని హీత్రో విమానాశ్రయంలో విమానం మారవలసి వచ్చింది. నేను హైదరాబాద్ నుంచి వస్తున్నానని గ్రహించిన పాస్‌పోర్ట్ తనిఖీ అధికారులు.. 'మరోసారి వచ్చేటప్పుడు హైదరాబాద్ బిర్యానీ తేగలరా' అని అభ్యర్థించారు. మన హైదరాబాద్ బిర్యానీకి పర్యాయపదంగా మారిపోయిందని నాకు అప్పుడు అర్థమైంది. ఎక్కడో ఖండాంతరాలకు చేరుకుంటున్న హైదరాబాద్ బిర్యానీ ఘుమఘుమలు మనకు మాత్రం సుదూరమే. ఇప్పుడు అసలుసిసలైన హైదరాబాద్ బిర్యానీ హైదరాబాద్‌లోనే దొరికే పరిస్థితి లేదు. ఏ వంటకం చూసినా కల్తీమయం కావడమే అందుకు కారణం.

వంటలలో రారాజులాంటిది హైదరాబాద్ బిర్యానీ. కోడిగుడ్లు, మాంసం, నెయ్యి, కూరగాయలు, ఇతర దినుసులు వాడటం వల్ల ఇది ఆరోగ్యాన్ని ప్రసాదించే వంటకంగా తయారవుతుందని పలు అధ్యయనాల్లో తేలింది. హైదరాబాద్ బిర్యానీలో పసుపు, జీలకర్ర, ఎండుమిర్చి, అల్లం, వెల్లుల్లి, కుంకుమపువ్వు లాంటి అనేక పదార్థాలు కలుపుతారు. ఇవన్నీ యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. ఈ యాంటీ ఆక్సిడెంట్లు మనల్ని ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు, ఉల్లిపాయలు, అల్లం, వెల్లుల్లితో వంటకం రుచికరంగా తయారవుతుంది. వీటిలో సల్ఫర్ సమ్మేళనాలు, మెగ్నీషియం, విటమిన్ బీ6, విటమిన్ సీ ఉంటాయి.


అయితే బిర్యానీలో ఎన్ని పదార్థాలున్నా ఏం ప్రయోజనం.. ఆహార కల్తీ కారణంగా అసలు సిసలు హైదరాబాద్ బిర్యానీ కనుమరుగవుతున్నది. ఆహా.. అని తింటే తప్పక దవాఖానకు వెళ్లాల్సిన పరిస్థితి. నగరవాసులను ఆహార కల్తీ అంత తీవ్రంగా కలవరపెడుతున్నది. హోటళ్లు, రెస్టారెంట్లలో తాజా ఆహారంలో కుళ్లిపోయిన ఆహారాన్ని కలిపి వడ్డిస్తుండటం ఆందోళనకరం. చేపలు, మాంసం, కూరగాయలను తాజాగా ఉంచడానికి రెస్టారెంట్ల యాజమాన్యాలు కొన్ని రసాయనాలను ఉపయోగిస్తుండటంతో కల్తీ జరుగుతున్నది. బేకరీ ఉత్పత్తులలో కలిపే రసాయనాలు విష పదార్థాలుగా ప్రభావం చూపుతాయి. బ్యాక్టీరియా, వైరస్‌లతో పాటు హానికరమైన రసాయనాలు చేరి ఆహార పదార్థాలు కలుషితం అవుతున్నాయి. సరైన పరిశుభ్రత పద్ధతులు పాటించకపోవడం, పురుగు మందుల వినియోగం, రుచి కోసం వాడే రసాయనాలు ఇందుకు దారితీస్తున్నది.

యూరోపియన్ యూనియన్ ఫుడ్ సేఫ్టీ అధికారుల నివేదిక ప్రకారం.. మన దేశంలో సుమారు 527 రకాల ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారక ఇథలీన్ ఆక్సైడ్ ఎక్కువగా ఉంది. వీటిలో నిత్యం మనం వాడే పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, గుడ్లు వంటివెన్నో ఉన్నాయి. ఇక, సరిగా ఉడకని మాంసం, సీఫుడ్‌లో ఉండే సాల్మొనెల్లా, కాంపీలోబాక్టర్, ఈ-కోలీ వంటి బ్యాక్టీరియాలు జీర్ణాశయ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఆహార పదార్థాలను ఎక్కువకాలం నిల్వ చేయడం వల్ల తేమతో వచ్చే బూజు (అఫ్లాటాక్సిన్) కొన్నిసార్లు ప్రాణాంతకంగా మారుతుంది. కాడ్మియం, సీసం వంటి లోహాలు ఒంట్లో చేరితే.. కాలేయం, మూత్రపిండాలు దెబ్బతిని రోగ నిరోధక వ్యవస్థ కుంటుపడుతుంది. ఇవన్నీ మహిళల పునరుత్పత్తి సామర్థ్యంపై తీవ్రంగా ప్రభావం చూపిస్తాయి. కల్తీ ఆహారంతో అతిసారం, అలర్జీలు, అస్తమా, అజీర్తి, అల్సర్, క్యాన్సర్ రుగ్మతలు వస్తాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆరోగ్య శాఖ ఆదేశాలతో సంబంధిత శాఖాధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కొలువుదీరిన టాస్క్‌ఫోర్స్ బృందం కొన్ని రోజులుగా నగరంలోని హోటళ్లలో తనిఖీలు చేస్తున్నది. అయితే తనిఖీ నివేదికపై వ్యాపారులు సంతకం చేసేందుకు నిరాకరించే పరిస్థితి ఉందంటే ఆహార కల్తీ, అపరిశుభ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

**రాష్ట్రంలో కల్తీ రాజ్యమేలుతున్న తరుణంలో ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. అనారోగ్యాలకు గురవుతూ దవాఖానలకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో కల్తీకి పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.**

1976 ఆహార భద్రత చట్టం ప్రకారం.. కల్తీ వ్యాపారులకు నోటీసులు జారీ చేసి శిక్షించాలి. అంతేకాదు, వినియోగదారులకు సులభంగా అర్థమయ్యే విధంగా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు బాధ్యత తీసుకొని కల్తీ ఆహార పదార్థాలపై అవగాహన కల్పించాలి. కల్తీని సులభతరంగా గుర్తించే పరీక్షలను ఆమోదించాలి. పాఠ్య ప్రణాళికలో ఆహార కల్తీ అంశాన్ని చేర్చడం తక్షణ చర్య. ప్రభుత్వం రూపొందించిన టాస్క్‌ఫోర్స్ క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం, ప్రజలను అప్రమత్తం చేయడం ఇప్పుడు అత్యవసరం.

**(వ్యాసకర్త: రసాయన శాస్త్ర విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా యూనివర్సిటీ)**




## సరెండరైన ఎలుక!

తప్పెవరిదీ కాదు
తొందర పాటంతా నాదే
పలుసార్లు బల్లి పడింది కదాని
నేను దుంకాను అంతే...!

బొద్దింకలు ఈగాదులు
ఎన్నిసార్లు పడినా
అవి పాకంతో కలిసిపోతవి
నాకే తెలివి లేక...!

తెరిచుంచిన గిన్నె మీంచి
చెట్నీ ఉందని చూసుకోక ఎగిరాను
కాలు జారి మీ వీడియో కంట పడ్డాను
దొరికిన దొంగనయ్యాను!

ఒకవైపు ప్రాణ భయంతో నేను
విలవిలలాడుతుంటే భూత దయలేక
వీడియో తీసిన వారిని కదా
అనాల్సింది తిట్టాల్సింది!

ఆ పేద విద్యార్థులకు
ఆహారమైనా బాగుండేది
టీవీ ఛానెల్స్ పదే పదే చూపిస్తుంటే
డ్రగ్స్ తీసుకున్న సెలబ్రెటీనయ్యా!


ఇది మాకు తొలిసారి కాదు
మీకు చివరిదీ కూడా కాదు
ఇట్లా దొరికిపోయినప్పుడు తప్ప మేం
పేద విద్యార్థులకు రక్త సంబంధీకులమే!

దయచేసి వంటవాళ్లని ఏమనకండి
వాడు వండే ప్రతి పాకంలో
ఉప్పు తక్కువైనప్పుడల్లా
స్వేదం దారబోస్తున్నాడు!!

(మెదక్ జేఎన్టీయూ హాస్టల్‌లో చెట్నీలో ఎలుక ఈదులాడటం చూసి...)



కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261




## ఇది కదా అసలైన ఎమర్జెన్సీ!



ఎమర్జెన్సీకి నేనూ వ్యతిరేకమే. కానీ, దేశంలో అసలైన ఎమర్జెన్సీ మోదీ హయాంలోనే అమలైంది. క్రిమినల్ చట్టాల్లో మోదీ సర్కార్ చేసిన మార్పులే దానికి తాజా ఉదాహరణ. భారతీయ న్యాయ సంహితలో ఏముందో ఎవరికీ తెలియదు. దానిగురించి కనీసం ప్రతిపక్షంతోనూ చర్చించలేదు. 147 మంది ఎంపీలను సస్పెండ్ చేసి ఈ మూడు చట్టాలను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఇది కదా అసలైన ఎమర్జెన్సీ.

**- మమతాబెనర్జీ,** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి